

రేపు జిల్లాకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు రాక

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 12: షెడ్యూల్ తెగల జాతీయ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ ఈ నెల 14న జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయనతో పాటు భారత ప్రభుత్వ కార్యదర్శి పెండ్లి కళ్యాణ్‌రెడ్డి, ఎస్సీ ఎస్టీ డైరెక్టర్ ఆర్‌ఎస్.మిశ్రా, రీసెర్చ్ అధికారి ఆకాష్ త్రిపాఠి, సీనియర్ ఇన్వెస్టిగేటర్ అశోక్‌కుమార్ కూడా పర్యటిస్తారని వెల్లడించారు. 'శనివారం ఉదయం మెళియాపుట్టి మండలంలోని కేరాశింగి, గూడ గిరిజన గ్రామాలకు వారు చేరుకుని గ్రామస్థులతో సమావేశం అవుతారు. అనంతరం జలుమూరు మండలం మాకి గ్రామంలో గిరిజనులతో సమావేశమై వినతులు స్వీకరిస్తారు. అదేరోజు మధ్యాహ్నం రెండు గంటలకు శ్రీకాకుళం కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులందరితో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం అరకు పర్యటనకు వెళతారు' అని కలెక్టర్ తెలిపారు.

ప్రపంచం డిజిటల్ రంగంలో దూసుకుపోతుంటే.. గిరిజనుల్లో మాత్రం వెనుకబాటుతనం కనిపిస్తోంది. వైద్య పరంగా విప్లవాత్మక మార్పులు జరుగుతున్నా.. ఏజెన్సీ ప్రాంతాల్లో మాత్రం డోలీ మోతలు తప్పడం లేదు. గర్భిణులకు పురిటినొప్పులు వస్తే.. అంబులెన్స్‌లు అందుబాటులో ఉండవు. కనీసం రోడ్లు లేక.. అంబులెన్స్‌లు రాక గర్భిణులకు ప్రసవ వేదన మిగులుతోంది. సకాలంలో వైద్యసేవలు అందక మాతాశిశు మరణాలు సంభవిస్తుండడంతో గిరిజనుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఈ కష్టాలు.. ఇంకెప్పుడు తీరేను?

- ఏజెన్సీ గ్రామాల్లో కానరాని అభివృద్ధి
- రహదారులు లేక గిరిజనులకు ఇక్కట్లు
- అత్యవసరమైతే తప్పని డోలీ మోతలు
- ఆందోళన కలిగిస్తున్న మాతాశిశు మరణాలు
- బడికి వెళ్లాలంటే కొండలు దిగాల్సిందే

- మెళియాపుట్టి మండలం గూడ గ్రామానికి చెందిన నిర్మలకు గతేడాది మార్చి 6న పురిటి నొప్పులు రావడంతో డోలీ సహాయంతో ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో కొండపై మార్గమధ్యలో ఆమె ప్రసవించింది.
- ఈ ఏడాది జనవరిలో మారుడ కోటలో పనిచేస్తున్న ఒక ఉపాధ్యాయు రాలు పురిటినొప్పులతో బాధపడగా.. విశాఖపట్నం తరలించారు. అక్కడ ఆమె మృతి చెందింది. ఇలా ఎప్పటికప్పుడు గిరిజన గ్రామాల్లో మాతాశిశు మరణాలు జరుగుతూనే ఉన్నాయి.

- గతేడాది డిసెంబరులో మెళియాపుట్టి మండలం కేరాశింగికి చెందిన గొడ్డూరు తనూజ అనే ఐదు నెలల గర్భిణి అస్వస్థతకు గురైంది. ఓ వైపు వర్షం కురుస్తుండగా.. ఆమె కుటుంబ సభ్యుల సాయంతో అతికష్టమ్మీద నాలుగు కిలోమీటర్లు నడిచి.. అంబులెన్స్ వద్దకు చేరుకుంది. అప్పై ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్స అందజేశారు.





- మెళియాపుట్టి మండలం అడ్డివాడ గ్రామానికి చెందిన లక్ష్మీకి గతేడాది మే నెలలో పురిటినొప్పులు రాగా.. కుటుంబ సభ్యులు 5 కిలోమీటర్ల మేర డోలీలో మోసుకుంటూ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

రహదారులు లేకే..

ఏటా గిరిజన గ్రామాల్లో రహదారులకు నిధులు వస్తున్నా, బిల్లులు జరుగుతున్నా పనులు మాత్రం పూర్తికావడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం సుమారు రూ.5కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. కానీ రహదారుల పనులు జరగలేదు. దీంతో మెళియాపుట్టి మండలంలోని కేరాశింగి, గూడ, చందనగిరి, అడ్డివాడ, దబ్బగుడ్డి, పెద్దకేదారి, చిన్నాకేదారి, ముత్యాల బొంతు, రింపి, అంపురం వంటి గ్రామాలకు అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఇటువంటి గ్రామాలకు ఫీడర్ అంబులెన్స్‌లు ఏర్పాటు చేసినా.. తరచూ మొరాయిస్తుండడంతో గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే దబ్బగుడ్డి విద్యార్థులు కొండలు దిగి పాఠశాలకు వెళ్లేందుకు ఆపసోపాలు పడుతున్నారు.

(మెళియాపుట్టి)

గిరిజన గ్రామాల్లో మాతాశిశు మరణాలు కలవరపెడుతున్నాయి. ప్రధానంగా కొండపై గ్రామాలకు రహదారి సౌకర్యం లేక.. వైద్యసేవలు సకాలంలో అందక.. గిరిజనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతినెలా కొండపై గ్రామాలకు వైద్యసిబ్బంది నడుచుకుని వెళ్లి.. సేవలు అందిస్తున్నారు. అత్యవసర సమయాల్లో మాత్రం గిరిజనులకు వైద్యసేవలు అందడం లేదు. ఈక్రమంలో గర్భిణులను కుటుంబ సభ్యులు కొండలపై నుంచి డోలీలో మోసుకుంటూ ఆస్పత్రికి తీసుకువస్తున్నారు. కాగా.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరైన వసతులు లేకపోవడంతో ప్రసవానికి నాలుగైదు రోజులు ముందుగా తీసుకురావడం లేదు. పురిటినొప్పులు వచ్చినప్పుడు ఆపసోపాలు పడుతూ.. ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు. దీంతో కొంతమంది గర్భిణులు సకాలంలో వైద్యసేవలు అందక ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. ఇటీవల నిర్వహించిన గిరిజనశాఖ సమీక్షలో మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో గర్భిణుల కోసం వసతిగృహాలు ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. దీనిపై గిరిజనులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలి.



కొండపై గ్రామాలకు నడుస్తూ వెళ్తున్న వైద్య బృందం (ఫైల్)

మాతాశిశు మరణాలిలా..

- 2019-20లో 39,073 మంది జన్మించారు. వీరిలో 432 మంది శిశువులు, 23 మంది బాలింతలు ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యశాఖ గణాంకాల్లో తెలిపారు.
- 2020-21లో 39,898 మంది జన్మించారు. వీరిలో 469 మంది శిశువులతోపాటు 24 మంది తల్లులు మరణించారు.
- 2021-22లో 40,170 మంది జన్మించారు. 246 మంది శిశువులు, 36 మంది బాలింతలు ప్రాణాలు కోల్పోయారు. గతేడాది 71 శిశు మరణాలు సంభవించాయి.
- మాతా,శిశు మరణాల నివారణపై గత ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేదు. వైద్యశాఖ నిధులు మంజూరు చేయలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా మాతాశిశు మరణాల నివారణకు చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

వారొచ్చినా.. తలరాతలు మారలేదు

గత ఏడాది జనవరి 9న జాతీయ ఎస్టీకమిషన్ సభ్యుడు అనంతనాయక్ మెళియాపుట్టిలోని ఏకలవ్య పాఠశాల పనులు పరిశీలించారు. ఈ ఏడాది ఇక్కడే తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. కానీ ఇప్పటివరకూ పనులు పూర్తికాలేదు.

- 2022లో అప్పటి రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు కుంబా రవిబాబు మెళియాపుట్టి మండలం చందనగిరి గిరిజన గ్రామంలో పర్యటించారు. నేలబొంతులో జీసీసీ మార్కెట్‌తో పాటు కొండలపై ఉన్న గ్రామాలకు రహదారుల పనులు పూర్తిచేయాలని తెలిపారు. కానీ ఇంతవరకు పనులు పూర్తికాలేదు.
- ఈ ఏడాది మార్చి 7న రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు డి.శంకరరావు మెళియాపుట్టి తహసీల్దార్ కార్యాలయంలో గిరిజన దర్బార్ నిర్వహించారు. కానీ గిరిజనుల నుంచి తీసుకున్న వినతులకు ఇప్పటికీ పరిష్కారం చూపలేదు.
- తాజాగా ఈ నెల 14న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్.. మెళియాపుట్టి మండలంలోని కేరాశింగి, గూడ గ్రామాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా.. ఆయన పర్యటనతోనైనా గిరిజనుల సమస్యల పరిష్కారానికి కొంతవరకైనా మోక్షం లభిస్తుందో లేదో వేచిచూడాలి.



పురిటినొప్పులు వస్తే భయమే..

గర్భిణులకు పురిటినొప్పులు వస్తే గ్రామస్థులందరికీ భయమే. రహదారి సౌకర్యం లేకపోవడంతో గర్భిణులను డోలీపై 7 కిలోమీటర్ల మేర మోసుకుంటూ కిందకు దిగుతాం. అక్కడి నుంచి అంబులెన్స్ ద్వారా ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్తాం.

-కర్రమ్మ, కేరాశింగి, మెళియాపుట్టి



తిరిగొస్తే మరో జన్మ ఎత్తినట్టే

గర్భిణులు ప్రసవం అనంతరం ఇంటికి తిరిగొస్తే మరో జన్మ ఎత్తినట్టే. రహదారులు లేక వాహనాలు మా గ్రామానికి రాలేని పరిస్థితి నెలకొంది.

-నీలమ్మ, అంపురం, మెళియాపుట్టి



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, పక్కన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వైభవంగా కొత్తమ్మతల్లి ఉత్సవాలు

- భక్తులకు ఉచిత దర్శనం, ప్రసాదం
- జాతర పేరుతో చందాలు, దందాలకు చెక్
- అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి
- మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

టెక్కలి/కోటబొమ్మాళి, సెప్టెంబరు 12: 'కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఉత్సవాలు ఈసారి రాష్ట్ర పండుగలా నిర్వహించేలా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అక్టోబరు 1 నుంచి 3 వరకూ ఉత్సవాలను అన్ని శాఖల సమన్వయంతో అంగరంగ వైభవంగా నిర్వహించాలి' అని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఉత్సవాల నిర్వహణపై గురువారం కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులు, గ్రామపెద్దలతో సమావేశమయ్యారు. మంత్రి మాట్లాడుతూ.. 'కొత్తమ్మతల్లి ఉత్సవాలకు జిల్లాతోపాటు ఉత్తరాంధ్ర, ఒడిశా, ఇతర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారు. ఉత్సవాల పేరిట చందాలు వసూలు చేస్తే చర్యలు తప్పవు. భక్తులు వారికి తోసిన సహాయం చేయాలి తప్ప.. మొక్కుల చెల్లింపు పేరిట ఎవరి వద్దా డబ్బులు డిమాండ్ చేయరాదు. భక్తులకు ఉచిత దర్శనం కల్పించాలి. నాణ్యమైన ప్రసాదం అందజేయాలి. ప్రత్యేక దర్శనాల ధరలు కూడా రూ.20, రూ.50 మించి ఉండరాదు. తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలి' అని ఆదేశించారు. 'కొత్తపేట నుంచి కోటబొమ్మాళి చివరి వరకు విద్యుత్‌దీపాలు అలంకరించాలి. కొత్తపేట, కోటబొమ్మాళి ప్రాంతాల్లో బ్లాక్‌టాప్ రోడ్లు, సెంటర్ డివైడర్ రంగులు, రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్‌తో పాటు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలి. రోడ్ల పక్కన చిరు దుకాణాల ఏర్పాటుకు సౌకర్యాలు కల్పించాలి. గాలిగోపురం మరమ్మతులు చేయాలి. అమ్మవారి ఆలయానికి రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దాలి. పట్టణంలో పదివరకు ఎల్ఈడీ స్క్రీన్‌లు, లౌడ్‌స్పీకర్లు ఏర్పాటు చేయాలి. బయోటాయిలెట్ల నిర్వహణ చేపట్టాలి. ఎగ్జిబిషన్‌లో నిర్ణీత ధరలే వసూలు చేయాలి. చివరిరోజున అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలి. ఆకట్టుకునే విధంగా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలి. ఆర్టీసీ బస్సుల సౌకర్యం కల్పించాలి. వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పోలీసులు చర్యలు చేపట్టాలి' అని ఆదేశించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ కొత్తమ్మతల్లి ఉత్సవాల నిర్వహణలో అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. పారిశుధ్య నిర్వహణ, సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని తెలిపారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవో సుదర్శన్ దొర, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.సుజాత, ఏసీ ప్రసాద్ పట్నాయక్, ఉపరవాణా అధికారి చంద్రశేఖరరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటరామన్, ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణమూర్తి, డీఎంహెచ్‌వో డాక్టర్ మీనాక్షి, జిల్లా అగ్నిమాపక అధికారి మోహనరావు, ఈవో రాధాకృష్ణ, బోయిన గోవిందరాజులు, బోయిన రమేష్‌కుమార్, పినకాన అజయ్‌కుమార్, జీరు భీమారావు పాల్గొన్నారు.

అధిక వడ్డీ ఆశ చూపి.. మోసం

- రూ.12.50 కోట్లు వసూలు
- బోర్డు తిప్పేసిన ప్రైవేటు సంస్థ
- లబోదిబోమంటున్న బాధితులు
- చివరకు రూ.2.50కోట్ల విలువైన స్థిరాస్తి ఇచ్చేందుకు ఒప్పందం



పలాస, సెప్టెంబరు 12: ఓ ప్రైవేటు సంస్థ అధికవడ్డీ ఆశ చూపి.. ఖాతాదారుల నుంచి రూ.కోట్లలో వసూలు చేసింది. కొద్దిరోజుల కిందట బోర్డు తిప్పేసి.. ఖాతాదారులను ముప్పుతిప్పలు పెట్టి.. చివరకు నామమాత్రంగా చెల్లింపులకు ఒప్పందం కుదుర్చుకుంది. వివరాల్లోకి వెళితే.. ముంబై, ఢిల్లీ ప్రాంతాల్లో ఉన్న ఓ ప్రైవేటు సంస్థ ఏడాదిగా పలాస-కాశీబుగ్గలో కార్యకలాపాలు సాగిస్తోంది. మాజీమంత్రి నివాసం ఉండే ప్రాంతంలో చందాదారులను చేర్పించింది. అధిక వడ్డీ ఆశ చూపి.. వారి నుంచి రూ.లక్ష నుంచి రూ.50లక్షల వరకూ తమ సంస్థలో పెట్టుబడులు పెట్టించింది. ఇలా రూ.12.50కోట్ల వరకూ వసూళ్లకు పాల్పడింది. సాధారణంగా బ్యాంకర్లు, ఇతర ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలు తమ సంస్థల్లో పెట్టుబడి పెడితే నెలకు ఒక శాతం(అంటే రూ.లక్షకు సుమారు రూ.వెయ్యి వరకూ) వడ్డీ ఇస్తాయి. కానీ ఈ సంస్థ మాత్రం ఏకంగా 18 శాతం వడ్డీ ఆశ చూపించడంతో రూ.కోట్లు పెట్టుబడి పెట్టారు. మూడు నెలల కిందట ఆ సంస్థ అడ్రస్ లేకుండా పోవడంతో స్థానికంగా ఉన్న బ్రోకర్లను డబ్బులు జమ చేసిన వారంతా పట్టుకున్నారు. దీనిపై వారు సంస్థ నిర్వాహకులతో చర్చించారు. కొంతమందికి బ్రోకర్లు తమ సొంత పూచీకత్తుపై కొంతమేర డబ్బులు చెల్లించారు. మిగిలిన వారికి అది కూడా అందలేదు. దీంతో తాము పోలీసుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తామని ఖాతాదారులు చెప్పడంతో వారు నిర్వాహకులను నిలదీశారు.

- నిమ్మాడ, పలాస ప్రాంతానికి చెందిన ఇద్దరు నిర్వాహకులు ముంబైలో నివాసం ఉంటూ సంస్థ కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో వీరికి స్థిరాస్తి ఉంది. దాన్ని చూసేందుకు రెండు రోజుల కిందట వారిద్దరూ పలాస-కాశీబుగ్గ రాగా ఖాతాదారులు ఈ విషయాన్ని గుర్తించి వారిని పట్టుకున్నారు. అనంతరం వారి నుంచి నగదు కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. కొంతమంది రాజకీయ నాయకుల ద్వారా మంతనాలు జరిపారు. చివరకు రూ.2.50 కోట్ల విలువైన వారి స్థిరాస్తి భూమిని ఇచ్చేందుకు అంగీకారం కుదిరింది. ఈమేరకు కాగితం రూపంలో రాయించుకుని రిజిస్ట్రేషన్లు చేయడానికి సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ వ్యవహారాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లకుండా వారే పరిష్కరించుకున్నట్లు స్పష్టమవుతోంది. అయితే రూ.12.50కోట్లకుగానూ రూ.2.50కోట్లు మాత్రమే ఇవ్వడం ఏమిటని ఖాతాదారులు ప్రశ్నిస్తున్నారు. రూ.లక్షలు పెట్టుబడులు పెడితే తమకు వచ్చేది కేవలం రూ.వేలల్లోనే ఆవేదన చెందుతున్నారు. మరికొందరు ఎంతోకొంత వచ్చిందని సరిపెట్టుకుంటున్నారు. ఇటువంటి అనధికార బ్యాంకులు, ప్రైవేటు సంస్థలపై పోలీసులు సమగ్ర విచారణ చేసి.. ఖాతాదారులకు కొంతయినా న్యాయం చేయాల్సి ఉంది.



పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

సోంపేట మండలం రాణిగాం జంక్షన్‌వద్ద ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. గురువారం శ్రీకాకుళం నుంచి సోంపేట వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు రాణిగాం వద్ద అదుపు తప్పింది. పక్కనే పొలాల్లోకి దూసుకెళ్లగా డ్రైవర్ అప్రమత్తమై బస్సును నిలిపేశాడు. ఆ సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉండగా.. ఏమైందోనని ఆందోళన చెందారు. కాగా.. ఎటువంటి ప్రమాదం సంభవించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. - సోంపేట



చింతబట్టికి గండి

సరుబుజ్జిలి మండలం యరగాం-పురుషోత్తపురం ఓపెన్‌హెడ్ చానెల్‌కు అనుసంధానంగా ఉన్న చింతబట్టికి పాలవలస సమీపంలో గురువారం గండి పడింది. దీంతో పాలవలస, పురుషోత్తపురం, పెద్దపాలెం, చిన్నపాలెం, అలమాజీపేట, ఫకీర్‌సాహెబ్‌పేట, చెవ్వాకులపేట గ్రామాల్లో సుమారు 400 ఎకరాల పంట భూములు ముంపునకు గురయ్యాయని రైతులు వాపోతున్నారు. ఏటా ఒకేచోట గండిపడుతున్నా అధికారులు తాత్కాలికంగా పనులు చేసి వదిలేస్తున్నారు తప్ప.. శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - సరుబుజ్జిలి

సెబ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

శ్రీకాకుళం క్రైం/ నరసన్నపేట, సెప్టెంబరు 12: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) కానిస్టేబుల్ ఆత్మహత్య కేసులో.. ఆమె భర్త అయిన మరో సెబ్ కానిస్టేబుల్ కె.విజయ్‌కుమార్‌ను గురువారం విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సెబ్ డీఎస్ఈవో సీహెచ్ తిరుపతినాయుడు వెల్లడించారు. కె.విజయకుమార్, అనూష దంపతులిద్దరూ సెబ్ కానిస్టేబుళ్లు. శ్రీకాకుళం నగరం న్యూకోలనీలో విజయ్‌కుమార్, నరసన్నపేటలో అనూష విధులు నిర్వహించేవారు. ఇటీవల అనూష.. భర్త వేధింపుల తాళలేక కన్నవారింట్లో ఉంటోంది. భార్యాభర్తల మధ్య విభేదాల నేపథ్యంలో ఈ నెల 5న తల్లి విజయలక్ష్మి ఇంట్లోనే అనూష ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ఆమెను నరసన్నపేట ఆస్పత్రిలో చేర్పించగా పరిస్థితి విషమించడంతో విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె 7న మృతి చెందింది. తన కుమార్తె మృతికి అల్లుడు విజయకుమార్, అతని కుటుంబ సభ్యుల వేధింపులే కారణమని విజయలక్ష్మి నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అయనను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో విజయకుమార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశామని సెబ్ డీఎస్ఈవో సీహెచ్ తిరుపతినాయుడు తెలిపారు.

అక్రమాలకు పాల్పడితే శిక్ష తప్పదు

- శ్రీకాకుళం విజిలెన్స్ ఎస్పీ ప్రసాదరావు



శ్రీకాకుళం క్రైం ,సెప్టెంబరు 12: ప్రభుత్వ ఆదాయ వనరులకు గండి కొడితే చర్యలు తప్పవని శ్రీకాకుళం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బర్ల ప్రసాదరావు స్పష్టం చేశారు. బదిలీపై జిల్లాకు వచ్చిన ఆయన గురువారం బాధ్యతలు స్వీక రించారు. డీఎస్పీ కిరణ్‌కుమార్, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. అనంతరం విజిలెన్స్ ఎస్పీ ప్రసాదరావు విలేకరులతో మాట్లాడుతూ.. 'రీజనల్ పరిధిలో వ్యాపారులు అక్రమాలకు పాల్పడితే శిక్ష తప్పదు. వారిపై కేసులు నమోదు చేస్తాం. ప్రతి ఒక్కరూ ట్రేడ్‌తో పాటు జీఎస్టీ లైసెన్సులు కలిగి ఉండాలి. దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి' అని పిలుపునిచ్చారు.

- బర్ల ప్రసాదరావు ఎస్ఐ స్థాయి నుంచి వివిధ హోదాలో విధులు నిర్వర్తిస్తూ.. ఎస్పీగా పదోన్నతి పొందారు. ఈయన స్వగ్రామం ఉమ్మడి విజయనగరం జిల్లా నర్సిపురం. 1989లో కోటబొమ్మాళి ఎస్ఐగా విధుల్లో చేరారు. 1999లో సోంపేట సీఐగా పదోన్నతిపై వెళ్లారు. తర్వాత శ్రీకాకుళం విజిలెన్స్ సీఐగా పనిచేసి.. విశాఖపట్నానికి బదిలీ అయ్యారు. గోపాలపట్నం, స్పెషల్ బ్రాంచ్, ఏసీబీలో సీఐగా విధులు నిర్వర్తించారు. 2009లో శ్రీకాకుళం విజిలెన్స్ డీఎస్పీగా పదోన్నతి పొందారు. అక్కడ నుంచి విశాఖ సిటీలో నార్త్ ఏసీపీగా బదిలీ అయ్యారు. మెరైన్ డీఎస్పీగా పని చేశారు. 2019లో ఏఎస్పీగా పదోన్నతి పొంది విజయవాడలోని డీజీపీ హెడ్‌క్వార్టర్స్‌లో పి.సి.ఎస్ విభాగంలో నాలుగున్నరేళ్లు పని చేశారు. ఇటీవల ఎస్పీగా పదోన్నతి పొంది.. ప్రస్తుతం శ్రీకాకుళం రీజనల్ ఎస్పీగా బదిలీపై వచ్చారు.

సూపర్ హీరోల ప్రేమకథ

సుధీర్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న కుటుంబ కథా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. అక్టోబర్ 11న విడుదలవుతోంది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మేకర్స్ హీరో నాని చేతుల మీదుగా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా



సుధీర్‌బాబు మాట్లాడుతూ 'ఇది మార్వెల్ సూపర్‌హీరో సినిమా కాదు. ఈ సినిమాలో హీరోకి ఉండే పవర్ పేరు ప్రేమ. ఇద్దరు సూపర్ హీరోల మధ్య జరిగే లవ్ స్టోరీ ఇది. కుటుంబంతో కలసి ఎంజాయ్ చేస్తూ చూసేలా ఉంటుంది' అన్నారు. అభిలాష్ మాట్లాడుతూ 'తండ్రీ కొడుకుల అనుబంధం నేపథ్యంలో రాసుకున్న అద్భుతమైన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. మా టీం చాలా కష్టపడింది. అందరూ ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. ఒక మంచి చిత్రంలో భాగమైనందుకు చాలా ఆనందంగా ఉందని హీరోయిన్ ఆర్ణ తెలిపారు. ఇలాంటి సినిమా చేసినందుకు గర్వంగా ఉందని సునీల్ చెప్పారు.



ఆంధ్రప్రదేశ్‌లో వరద బాధితులను ఆదుకునేందుకు రూ. 50 లక్షల విరాళం ప్రకటించిన సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గురువారం సీఎం చంద్రబాబునాయుడును కలసి చెక్కును అందజేశారు. అలాగే రూ. 50 లక్షలు విరాళంగా ప్రకటించిన వెంకట్ అక్కినేని, రూ. 15 లక్షల సాయం ప్రకటించిన సిద్ధు జొన్నలగడ్డ, రూ. 5 లక్షలు విరాళంగా ప్రకటించిన విష్వక్‌సేన్ సీఎంను కలసి చెక్కులు అందజేశారు.

ఫ్యామిలీతో చూడతగ్గ చిత్రం

'ఈ సినిమాతో అందరికీ ఎమోషనల్ కనెక్షన్ ఉంది. సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అనే ఆసక్తితో అందరూ పని చేశారు. నేను సలహాలు ఇవ్వడం వరకే కానీ నిజానికి కష్టపడింది మాత్రం టీమే. వీళ్ల కష్టానికి తగిన ఫలితం మంచి హిట్ ద్వారా వస్తుందని బలంగా కోరుకుంటున్నాను' అన్నారు దర్శకుడు మారుతి. రాజ్ తరుణ్ హీరోగా నటించిన 'భలే ఉన్నాడే' చిత్రం శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో ఆయన పాల్గొన్నారు. జె. శివసాయి వర్ధన్ దర్శకత్వంలో ఎన్వీ కిరణ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమంలో రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'మా సినిమాకు అతి ముఖ్యమైన వ్యక్తి దర్శకుడు శివసాయి. మారుతిగారు చెప్పిన పాయింట్‌ను అద్భుతంగా తెరకు ఎక్కించారు. పని రాక్షసుడు. నన్ను చాలా కొత్తగా



చూపించాడు. గ్రేట్ డైరెక్టర్ సింగీతం గారితో కలసి పని చేయడం గొప్ప అనుభూతి' అన్నారు. తన పదిహేనేళ్ల కలను నిజం చేసిన మారుతికి దర్శకుడు శివసాయి కృతజ్ఞతలు తెలిపారు. ఫ్యామిలీతో చూడతగ్గ చిత్రమిదని నిర్మాత కిరణ్‌కుమార్ చెప్పారు.

పాటల ప్రపంచాన్ని వదిలి వెళ్లిపోయిన గురుచరణ్



'ముద్దబంతి నవ్వులో మూగ బాసలు', 'బోయవాని వేటుకు గాయపడిన కోయిల', 'ముసిముసి నవ్వుల లోన..' 'నీక్కావాల్సింది నా దగ్గర ఉంది' వంటి మెలోడీ సాంగ్స్ రాసిన గురుచరణ్ (77) ఇక లేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం కన్నుమూశారు. గురుచరణ్ అసలు పేరు మానాపురం రాజేంద్రప్రసాద్. ఎన్టీఆర్, శోభన్‌బాబు నటించిన పలు చిత్రాలకు దర్శకత్వం వహించిన పాత తరం దర్శకుడు మానాపురం అప్పారావు తనయుడే ఈ రాజేంద్రప్రసాద్. వాళ్ల అమ్మగారు ఎం.ఆర్. తిలకం కూడా నటీమణే. (ఎన్టీఆర్ నటించి, నిర్మించిన 'ఉమ్మడి కుటుంబం' చిత్రంలో 'పోవు చున్నావా యమధర్మ రాజా' పాట పాడింది ఆవిడే) ఎం.ఎ. చదివిన గురుచరణ్ ప్రముఖ గీత రచయిత ఆచార్య ఆత్రేయ దగ్గర శిష్యరికం చేశారు. గురువు మీద గౌరవంతో 'గురుచరణ్' అని తన పేరు మార్చుకుని, ఆ పేరుతోనే పరిశ్రమలో కొనసాగారు. మోహన్‌బాబు నిర్మించిన 'అల్లుడుగారు' గీత రచయితగా గురుచరణ్ తొలి చిత్రం. 'ముద్దబంతి నవ్వులో మూగ బాసలు' ఆయన రాసిన తొలి పాట. గురుచరణ్ అంటే మోహన్‌బాబుకు ఎంతో అభిమానం. తను నిర్మించిన ప్రతి చిత్రంలోనూ గురుచరణ్‌తో కనీసం ఒక పాటన్నా రాయించేవారు. రెండు వందలకు పైగా పాటలు రాసిన గురుచరణ్ కొన్ని అనువాద చిత్రాలకు మాటలు కూడా రాశారు. గురుచరణ్‌కు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.



నిదుర కుదురు చెదిరిపోయే



వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తూ వరుస విజయాలను సొంతం చేసుకుంటున్నారు సుహాస్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'జనక అయితే గనక'. సంగీర్తన కథానాయిక. శిరీష్ సమర్పణలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్‌రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహించారు. దసరా సందర్భంగా అక్టోబర్ 12న ఈ చిత్రం విడుదలవుతోంది. గురువారం చిత్రబృందం 'నువ్వే నాకు లోకం... నిదుర కుదురు చెదిరిపోయే' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. దూరమైన భార్యను గుర్తు చేసుకుంటూ భర్త మనసు పడే బాధను వర్ణిస్తూ సాగే ఈ గీతానికి కృష్ణకాంత్ సాహిత్యం అందించారు. విజయ్ బుల్గానిన్ స్వరాలు సమకూర్చారు. కార్తిక్ హృద్యంగా ఆలపించారు.

అప్‌డేట్స్

దాండియా ఆడుతూ..



కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న భారీ పీరియాడికల్ థ్రిల్లర్ 'క' చిత్రంలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇందులో తన్వీ రామ్ పోషిస్తున్న రాధ పాత్ర ఫస్ట్ లుక్ విడుదల చేశారు. దాండియా ఆడుతూ అందంగా కనిపిస్తూ తన్వీ రామ్ అందరినీ ఆకట్టుకుంటోంది. 'క'లో ఆమెది కీలకమైన పాత్ర. జంట దర్శకులు సుజీత్, సందీప్ దర్శకత్వంలో విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో చింతా గోపాలకృష్ణారెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో త్వరలో ఈ సినిమా విడుదల కానుంది.

ప్రకృతిని కాపాడే బందీ



ఆదిత్య ఓం నటించిన 'బందీ' చిత్రం త్వరలో విడుదల కానుంది. తిరుమల రఘు స్వీయ దర్శకత్వంలో వెంకటేశ్వరరావుతో కలసి ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రం టీజర్ విడుదల చేసిన అనంతరం రఘు మాట్లాడుతూ 'ఒకే ఒక్క పాత్రతో రూపుదిద్దుకున్న చిత్రమిది. ప్రకృతిని నాశనం చేసే కార్పొరేట్ కంపెనీలకు లీగల్ అడ్వైజర్‌గా ఉండే పాత్రను ఆదిత్య ఓం పోషించారు. అటువంటి వ్యక్తిని అడవుల్లో వదిలేస్తే ఏలా ఉంటుందనే ఆసక్తికరమైన కథనంతో ఈ చిత్రం రూపుదిద్దుకుంది. మా హీరో ఇప్పుడు 'బిగ్‌బాస్'లో ఉన్నారు. ఆయన సక్సెస్ అయి వస్తాడని ఆశిస్తున్నాం. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు. అమెరికాలో ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు వీఎఫ్ఎక్స్ హెడ్ జాకబ్ చెప్పారు.









నియోజకవర్గంలో భూ ఆక్రమణలపై చర్యలు

● ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, సెప్టెంబరు 12: పలాస నియోజకవర్గంలో భూ ఆక్రమణలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో లెక్కలేనన్ని భూ ఆక్రమణలు, దందాలు జరిగాయని, వాటి వివరాలు సేకరిస్తున్నామని, వాటిపై చర్యలుంటాయని స్పష్టంచేశారు. మొత్తం సేకరిస్తున్నామని, దీనిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పటికే సంబంధిత ఆధారాలు సేకరించామన్నారు. పలాసలో గత ప్రభుత్వంలో జర్నలిస్టులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను తొలగిస్తున్నామనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు. అర్హత ఉన్న జర్నలిస్టుందరికీ ఆరు నెలల్లో ఇళ్లస్థలాలివ్వడం జరుగుతుందన్నారు.

వరద బాధితులకు రూ.25 వేల విరాళం



ఎమ్మెల్యే శిరీషకు చెక్కు అందిస్తున్న సత్యారావు

వరద బాధితుల సహాయ నిధికి స్థానిక వ్యాపారి ఎరుకోల సత్యారావు రూ.25 వేలను అంద జేశారు. ఈ మేరకు చెక్కును ఎమ్మెల్యే గౌతు శిరీషకు అందించారు. ఈ మొత్తాన్ని సీఎంఆర్ఎఫ్‌కు పంపాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, కోట్ని దుర్గాప్రసాద్, మల్లా శ్రీనివాస్, పెంట ఉదయ్‌శంకర్, పెంట శ్రీను, గాలి కృష్ణారావు, తమ్మినేని గంగారామ్, దేవుడు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి

● మండల సమావేశంలో ఎమ్మెల్యే బగ్గు



పోలాకి: పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు (సారవకోట): రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేద్దామని, ఇందులో అందరూ భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులపై శాఖలు వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదే శించారు. గిరిజన గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలన్నారు. సమావేశానికి ఐటీడీఏ అధికారులు గైర్హాజరవడంపై ఆయన అసహనం వ్యక్తంచేశారు. దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రామారావు, ఎంపీడీవో రాంబాబు, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంఈవో ఎంవీరమణ, ఏవో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

మబగాం(పోలాకి): మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మబగాంలో మండలస్థాయి గ్రిగ్స్ పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే విద్యతో పాటు క్రీడల్లోనూ పాల్గొనాలని కోరారు. పలు పాఠశాలల నుంచి సుమారు 500 మంది బాల, బాలికలు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాధాకృష్ణ, మాజీ విప్ తెలుగు పావని, గ్రామపెద్ద కాయ రవి, యువజన విభాగం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శుక్రవారం బాలురకు పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

స్పోర్ట్స్ అకాడమీకి ఎంపిక



దివ్యధాత్రిని,తల్లిదండ్రులను అభినందిస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుచున్న పి.దివ్యధాత్రి స్పోర్ట్స్ అకాడమీకి ఎంపికైంది. ఇటీవల విశాఖలో శాయ్ ఆధ్వర్యంలో జరిగిన వాలీబాల్ ఎంపికలో ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకట్రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమెతో పాటు తల్లిదండ్రులను అభినందించారు. ఉపాధ్యాయులు రూపవతి, శ్రీనివాసశర్మ, రాజేంద్రనాయుడు ఉన్నారు.

కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు పదవి పట్ల హర్షం

సంతబొమ్మాళి: కేంద్ర విమానయాన శాఖ మంత్రి, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుకు ఆసియా పసిఫిక్ మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ ఛైర్మన్‌గా ఎన్నికవడంపై టీడీపీ మండల అధ్యక్ష, కార్య దర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ అట్టాడ రాంప్రసాద్ హర్షం వ్యక్తంచేశారు. చిన్న వయసులో కేంద్రమంత్రిగా వ్యవహరించడమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం హర్షణీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. హర్షం వ్యక్తంచేసిన వారిలో తెలుగు యువత కార్యదర్శి సూరాడ దాసురాజు, నాయకులు సూరాడ ధనరాజ్, ధనలక్ష్మి తదితరులున్నారు.

కిడ్నీ పరిశోధనా కేంద్రంలో అరుదైన శస్త్ర చికిత్స

పలాస: వజ్రపుకొత్తూరు మండలం గరుడభద్ర గ్రామానికి చెందిన యండమూరి నరసమ్మ అనే వృద్ధురాలికి కిడ్నీ పరిశోధనా కేంద్రంలో వైద్యులు శస్త్ర చికిత్స చేసి ఐదు కిలోల కణితిని తొలగించారు. వివరాలిలా ఉన్నాయి.. నరసమ్మ కొంతకాలంగా కడుపులో నొప్పిగా ఉందని బుధవారం కిడ్నీ పరిశోధనా కేంద్రంలో చేరారు. స్త్రీ వైద్య నిపుణులు కణితి సాహితి బాధితురాలి జీర్ణాశయం స్కానింగ్ చేసి అందులో కణితి ఉందని తెలుసుకున్నారు. ఎనస్థీషియన్ సాయంతో గురువారం శస్త్రచికిత్స చేసి ఆ కణితిని తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

కొత్తమ్మ తల్లిని దర్శించుకున్న కలెక్టర్, జేసీ

కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లిని గురువారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సుసరాపు గణపతి శర్మ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, దేవదాయశాఖ డెప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత, ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణమూర్తి, ఉపరవాణా కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, దేవదాయశాఖ ఏసీ ప్రసాద్‌పట్నాయక్ దర్శించు కున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బోయిన గోవిందరాజులు, కల్లి నాగయ్యరెడ్డి, తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, వెలమల కామేశ్వరరావు, పూజారి శైలజ, నంబాళ్ల రాజశేఖర్, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హిరమండలం: హిరమండలం ఫీడర్ పరిధిలో శుక్రవారం చెట్ల కొమ్మలు తొలగింపు, నిర్వహణ వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టెక్కలి ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల హిరమండలం, సుభలయ, నౌగూడ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు గమ నించి సహకరించాలని కోరారు.

హరిపురం విద్యుత్ ఫీడర్ పరిధిలో..

మందస/హరిపురం: మందస మండలం హరిపురం విద్యుత్ ఫీడర్ పరిధిలో హొన్నాళి, హరిపురం, సిరిపురం, బుడార్సింగి, పొత్తంగి గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ యోగేశ్వరరావు తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కొత్తగ్రహారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

నందిగాం: కొత్తగ్రహారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి దేవుపురం ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టెక్కలి ఈఈ జి.శంకరరావు, నందిగాం ఏఈ వెంకటరమణ ఒక ప్రకట నలో తెలిపారు. దేవుపురం ఫీడర్ పరిధిలో పిచ్చి మొక్కల తొలగింపుతో పాటు మరమ్మతుల దృష్ట్యా తురకలకోట, దేవుపురం, జడ్యాడ, బడగాం, బోరుభద్ర, కాపుతెంబూరు, లవునిపల్లి, సింగు పురం, వజ్జీలపేట తదితర గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి



పలాస: పలాస నియోజకవర్గంలో జరిగిన భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణయాదవ్ కోరారు. ఈ మేరకు గురువారం ఆర్డీవో భరత్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందిచారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో పలు ప్రభుత్వ భూములను ఆక్రమించి రియల్ ఎస్టేట్‌లుగా మార్చుకుంటున్నారని, వీటిపై విచారణ చేపట్టి ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని కోరారు.

ఆఫ్‌షోర్ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

మెళియాపుట్టి: ఆఫ్‌షోర్ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని అచ్చనాపురం గ్రామస్థులు కోరారు. ఈ మేరకు గ్రామస్థులు తహసీల్దార్ ఎన్.హనుమంతరావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2009లో సర్వే చేసి కొందరికే నష్టపరిహారం అందించారన్నారు. ఇంకా 44 ఇళ్లకు పరిహారం ఇవ్వాల్సి ఉందన్నారు. అందరికీ 2013 చట్టం ప్రకారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన చైతన్య వేదిక అధ్యక్షుడు సవర చొక్రారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ బోధనకు గుర్తింపు

పోలాకి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన చేసిన ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలకు ప్రభుత్వం గుర్తింపునిస్తోందని ఎంఈవోలు శ్రీనివాసనాయక్, లింగరాజు అన్నారు. ఈ మేరకు ఇటీవల జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న కోడూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆరవల్లి శ్రీనివాసశర్మను గురువారం పోలాకి ప్రభుత్వ పాఠశాలలో సత్కరించారు. విద్యాభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలు ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో పాటు ఆదర్శ పాఠశాల ఈదులవలస ప్రిన్స్‌పాల్ పైడి ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటనను విజయవంతంచేయండి

జలుమూరు (సారవకోట): జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుసేన్ నాయక్ శనివారం జిల్లాలో పర్యటిస్తున్నట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి తెలిపారు. ఈ మేరకు సారవకోటలో గురువారం సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులు జలుమూరు మండలం ఎస్టీ మాకివలసను, మెళియాపుట్టి మండలం కేరసింగిగూడలో పర్యటించి సమస్యలను తెలుసుకుంటారన్నారు. ఈ పర్యటనకు ఆదివాసీ సంఘాలు, గిరిజనులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు బెజ్జి కృష్ణ, జన్ని దాలయ్య, మన్మథరావు, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

పంట తెగుళ్లపై అవగాహన కలిగి ఉండాలి

హిరమండలం: వరి పంటకు సోకే తెగుళ్లపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వనరుల కేంద్రం ఏవో వై.సూర్యకుమారి అన్నారు. పొలంబడిలో భాగంగా గురువారం హిరమండలం సుభలయ రైతులకు పంట నిర్వహణ పద్ధతులపై క్షేత్రస్థాయిలో అవగాహన కలిగించారు. ఏడీఏ బి.రాజ గోపాల్, ఏవోలు అనూష, ఎస్.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

టెక్కలి: టీడీపీ ఎన్నికలకు ముందు రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామన్న హామీని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ నాయకులు బగాది వాసు దేవరావు, బొడ్డేపల్లి మల్లయ్య కోరారు. ఈ మేరకు గురువారం లింగాలవలస గ్రామ సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంపతిరావు ఉమాపతి, సీపీఎం నాయకుడు నంబూరు షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే తెలియజేయండి: ఆర్డీవో



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో రంగయ్య

జలుమూరు: అంధవరం, దొంపాక గ్రామాల వద్ద వంశధార నదిలో ఇసుక ర్యాంపుల ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని, ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలని శ్రీకాకుళం ఆర్డీవో సీహెచ్ రంగయ్య అన్నారు. అంధవరం, దొంపాక గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంధవరం పంచాయతీ ఉప్పరపేట వద్ద రోడ్డు బాగా పాడైందని, పక్కా రహదారి నిర్మించాలని గ్రామస్థులు కోరారు. అలాగే దొంపాక ఇసుక ర్యాంపులో స్థానికులకు పని కల్పించి ఉపాధి చూపించాలని ఆ గ్రామస్థులు కోరారు. దొంపాక ఇసుక ర్యాంపు తిమడాం పరిధిలో ఉన్నందున తిమడాం గ్రామస్థులకు కూడా ఉపాధి కల్పించాలని వారు కోరారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను కలెక్టర్‌కు నివేదించనున్నట్లు ఆర్డీవో తెలిపారు. కార్యక్ర మంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, పర్యావరణ పరిరక్షణశాఖ ఇంజనీర్ శంకరనాయక్, ఆర్.ఐ సతీష్‌కుమార్, మండల సర్వేయర్ నాగేశ్వరరావు, వీఆర్వో గోపి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు హెచ్చరించినా ఆగని అక్రమ నిర్మాణాలు



పనులను అడ్డుకుంటున్న రెవెన్యూ అధికారులు

మెళియాపుట్టి: మెళియాపుట్టి మూడురోడ్ల కూడలిలోని పాలకర్ర చెరువు సర్వే నెంబర్ 348లో ఆక్రమణలు చేసి ఆక్రమణదారులు నిర్మాణాలు చేపట్టడంతో బుధవారం రెవెన్యూ అధికారులు అడ్డుకుని తక్షణం పనులు నిలిపి వేయాలని హెచ్చరించినా గురువారం మరలా నిర్మాణ పనులు చేపట్టారు. వీఆర్వో కోటేశ్వరరావుతో పాటు కార్యదర్శి చింతల అప్పారావు సదరు ప్రాంతానికి వెళ్లి పనులు నిలిపివేయాలని ఆక్రమణదారులను మరోసారి హెచ్చరించారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. అయినప్పటికీ మళ్లీ రాళ్లు, ఇసుక వేయించడంపై స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని వారు కోరుతున్నారు.

ఆక్రమణదారులకు నోటీసులు జారీ

ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేట జంక్షన్, అలికాం-బత్తిలి ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న డోల చెరువు, బారికి వాని చెరువు గట్లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ వైవీ పద్మావతి గురువారం తెలిపారు. డోలచెరువు గట్టుపై 30 మంది, బారికివాని చెరువు గట్టుపై 8 మంది ఆక్రమణదారులు అక్రమంగా భవనా లు నిర్మించడంతో గతంలో ఆక్రమణలు తొలగించేందుకు తగు చర్యలు తీసుకున్న సమయంలో ఆక్రమణదారులు న్యాయ స్థానాన్ని ఆశ్రయించడంతో ఆ మేరకు నిర్మాణాలు తొలగింపు నిలిచిపోయింది. దానిని ఆసరాగా తీసుకొని ఆ తరువాత మరి కొందరు ఆ చెరువుగట్లపై నిర్మాణాలు చేపట్టారు. అయితే న్యాయస్థానం ఆదేశాల మేరకు రెండు చెరువు గట్లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టి న్యాయస్థానాన్ని ఆశ్రయించిన వారందరికీ నోటీసు లివ్వడం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. ఈ మేరకు గురువారం పలువురు ఆక్రమణదారులకు నోటీసులిచ్చారు.

ప్రత్యేకావసరాల పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ఎల్.ఎన్.పేట: మండలంలోని వివిధ పంచాయతీ గ్రామాల్లోని ప్రత్యేకావసరాల (దివ్యాంగుల) పిల్లలపై ఐఈ ఆర్టీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా సమగ్రశిక్ష సహిత విద్య అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ ఉమా అన్నారు. స్థానిక భవిత కేంద్రాన్ని గురువారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. వివిధ రకాల అంగవైకల్యంతో ఉన్న పిల్లలకు క్రమం తప్పకుండా ఫిజి యోథెరపీ చేయించడం ద్వారా సుమారు 80 శాతం తగ్గే అవకాశం ఉందన్నారు. సమగ్ర శిక్ష సహిత విద్యలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు గ్రామాల్లో అంగవైకల్యం ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వం అందిస్తున్న సేవలు పొందేలా కృషి చేయాలన్నారు. ఐఈ ఆర్టీలు ఎస్.సురేష్‌కుమార్, డి.శ్రావణి పాల్గొన్నారు.

పారా మిలటరీ సైనికుల సమస్యలను పరిష్కరించండి



నరసన్నపేట: పారా మిలిటరీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా సభ్యుడు కె.లక్ష్మణ్, సఘ న్యాయ సలహాదారు జక్కల వంశీకృష్ణ కోరారు. ఈ మేరకు గురువారం వేర్వేరుగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్‌లను కలిసి వినతి పత్రాలు అందించారు. సీఏపీఎఫ్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, కేపీకేబీ కాంటీన్లను జిల్లాల వారీగా ప్రారంభిం చాలని కోరినట్లు వారు తెలిపారు.

క్విజ్ పోటీ విజేతలకు బహుమతి ప్రదానం

వజ్రపుకొత్తూరు: డోకులపాడులో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక విఘ్నేశ్వర మందిరం వద్ద సైనిక్‌సేవాదళ్, పూజా కమిటీ ఆధ్వర్యంలో మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలు గాయత్రి విద్యాయలం (గరుడభద్ర-ప్రథమ), ద్వితీయ, తృతీయ స్థానాలను బాతుపురం, డోకులపాడు హైస్కూల్ జట్లు గెలుచుకు న్నాయి. విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను గురువారం అందించారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో ఇబ్బందులు

పలాసరూరల్: పలాస విద్యుత్ కార్యాలయంలో వినియోగదారులు బిల్లులు చెల్లింపు వేళలు సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల, మరలా మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకే బిల్లులు తీసుకుంటున్నా రని పలువురు వినియోగదారులు పేర్కొంటున్నారు. అయితే సరైన వేళలు లేకపోవడం, కౌంటర్ ఆలస్యంగా తెరిచినా ముందే మూసి వేస్తున్నారని, ప్రశ్నించిన వినియోగదారులతో సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తగుచర్యలు తీసుకుని సమయాలను పెంచాలని వారు కోరుతున్నారు.

సైనికుల్లా పనిచేయాలి

కోటబొమ్మాళి: గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న దృష్ట్యా పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లుగా గ్రామాల్లో అభివృద్ధి లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. గ్రామాల అభివృద్ధికి బాటలు వేసుకోవాలని, అందరూ ఐక్యంగా పనిచేయాలని కోరారు.

క్రీడా స్ఫూర్తి పెంపొందించుకోవాలి

టెక్కలి: పోటీలో గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తి పెం పొందించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ అన్నారు. గురువారం కళాశాల ఆవరణలో స్కూల్‌గేమ్స్ గ్రిగ్స్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు తులసీరావు, చిన్నారావు, ఇన్‌చార్జి నారాయణరావు, వ్యాయామ అధ్యాపకులు రామిరెడ్డి, ఆదిశేషు, సూర్యకాంతం, జగ్గమ్మ, నీలయ్య, జగదీష్, మీనాక్షి, ఇంద్రాణి, రమేష్, గిరిబాబు పాల్గొన్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించండి

వజ్రపుకొత్తూరు: 1998 డీఎస్సీలో మినిమం టైంస్కే (ఎంటీఎస్) ఎంపికైన ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ విరమణ వయసు 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచాలని ఆ సంఘం జిల్లా ప్రతినిధి గొండు మధుసూదనరావు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే చాలా వరకు సర్వీసును నష్టపోయామని, ఇప్పటికైనా తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

ఎస్ఐగా రమేష్‌బాబు



మెళియాపుట్టి: ఎస్ఐగా పిన్నింటి రమేష్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన టి.రాజేష్‌ను వీఆర్‌కు పంపిన సంగతి తెలిసిందే. బాధ్యతలు చేపట్టిన రమేష్ బాబు మాట్లాడుతూ.. సరిహద్దులో ఒడిశా నుంచి గంజాయి, మద్యం రవాణా కాకుండా గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. నేరాల అదుపునకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ

పాతపట్నం: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు గాను గురువారం విద్యార్థులు విరాళాలను సేకరించారు. స్థానిక అమరజ్యోతి స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సోమేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు పలువురు వ్యాపారులు, ఉద్యోగులను కలిసి విరాళాలను సేకరించారు. ఈ మొత్తాన్ని వరద బాధితులకు వినియోగించనున్నట్లు ఆయన తెలిపారు.

సీతారాం ఏచూరి మృతి తీరనిలోటు

కొత్తూరు: సీపీఎం జాతీయ నేత సీతారాం ఏచూరి మృతి తీరని లోటని ఆ పార్టీ కమిటీ సభ్యుడు శిర్ల ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో సుమారు 1500 సాగిన బైక్‌యాత్ర ముగింపు సభలో ఆయన చేతుల మీదుగా జ్ఞాపికను అందుకున్నట్లు గుర్తు చేసుకున్నారు. ఒక మేధావిని దేశం కోల్పోయిందన్నారు.

కుర్చీల వితరణ

నందిగాం: ఎమ్మార్సీకి విశ్రాంత ఉపాధ్యాయులు, ఎంఎస్‌టీ ఉపాధ్యాయులు కుర్చీలు వితరణగా అందించారు. ఈ మేరకు గురువారం ఎంఈవో జి.నర్సింహులు సమక్షంలో రోల్ కుర్చీతో పాటు ఎనిమిది ప్లాస్టిక్ కుర్చీలను అందజేశారు.

గణనాథునికి 108 ప్రసాదాల సమర్పణ



108 రకాల ప్రసాదాలతో నైవేద్యం

హిరమండలం: హిరమండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దిగువ వీధి, కైవాడ వీధుల్లో గురువారం గణనాథునికి ప్రత్యేక పూజలు చేసి 108 రకాల నైవేద్యాలను స్వామికి సమర్పించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్థానికులు పాల్గొన్నారు.

భగవాన్‌పురంలో దీపారాధన

టెక్కలి: భగవాన్‌పురంలో వినాయక ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి మహిళలు దీపారాధన చేశారు. జై గణేశ, శివలింగాల రూపంలో దీపాలను వెలిగించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశా రు. ● పాతనౌపడాలో వినాయక ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి నిమజ్జనోత్సవం చేశారు. ఈ సందర్భంగా లడ్డూ వేలంపాట నిర్వహించారు. ఈ లడ్డూను గ్రామా నికి చెందిన దల్లి పార్వతమ్మ రూ.65 వేలకు వేలం పాడారు.

● **నందిగాం:** నందిగాంలో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం రాత్రి దీపారాధన చేపట్టారు. ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో మహిళలు దీపాలను వెలిగించి భక్తి భావాన్ని చాటుకున్నారు. ● **హరిపురం:** హరిపురం బజారు వీధిలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. వేదపండితుడు మద్దిబట్ల శాంతారావు శర్మ ఆధ్వర్యంలో శాంతి హోమం చేపట్టారు.



నందిగాం: దీపారాధన దృశ్యం



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

చెరువులో జారిపడి వ్యక్తి మృతి

రణస్థలం: పతివాడపాలెం గ్రామానికి చెందిన ఎస్.సన్యాసిరావు (53) గురువారం చెరువులో జారిపడి మృతి చెందాడు. జేఆర్ పురం ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. ఉపాధి పనులకువెళ్లి వస్తూ చెరువు వద్ద కాళ్లు చేతులు కడుగుకునే సమయంలో ప్రమాదవశాత్తు జారి పడిపోయాడు. అతడికి ఈత రాకపోవడం.. ఆ పరిసరాల్లో ఎవరూ లేకపోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. సన్యాసిరావుకు భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. మృదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. భార్య దన్నమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ ఒకరు..


వీరయ్య (ఫైల్)

జలుమూరు, (సారవకోట): సారవకోట రెల్లి వీధికి చెందిన కోటిపల్లి వీరయ్య (62) విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ బుదవారం రాత్రి మృతిచెందాడు. స్థానికులు వివరాలు మేరకు గత నాలుగు రోజులుగా పడిన వర్షాలకు ఇంటిగోడ తడిసి బుధవారం మధ్యాహ్నం కూలిపోయింది. ఈ ప్రమాదంలో కోటిపల్లి వీరయ్యకు తలకు దెబ్బలు తగిలాయి. చికిత్స నిమిత్తం నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కెజిహెచ్‌కి మెరుగైన వైద్యం కోసం తరలించారు. కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు భార్య సింహాద్రి తహసీల్దారు విజయలక్ష్మికి ఫిర్యాదు చేసారు. సింహాద్రి ఫిర్యాదు మేరకు సిబ్బందితో దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు తెలిపారు. ఇతనికి భార్య సింహాద్రి, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరందరికి వివాహాలు జరిగిపోయినట్లు స్థానికులు తెలిపారు.

పాము కాటుతో మహిళ..


లక్ష్మి(ఫైల్)

బూర్జ: మండల కేంద్రం బూర్జ గ్రామానికి చెందిన ఖండ్యాపు లక్ష్మి(53) పాము కాటుకు గురై మృతి చెందింది. గురువారం పొలం పనులు చేస్తుండగా పాముకాటుకు గురైన లక్ష్మి.. అది గుర్తించకపోవడంతో సాయంత్రానికి పరిస్థితి విషమించి పొలంలోనే చనిపోయింది. దీంతో ఆమె భర్త రామారావు పోలీసులు ఫిర్యాదు చేశాడు. పోస్టుమార్టం నిమిత్తం లక్ష్మి మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమెకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వోకు తీవ్ర గాయాలు

బూర్జ: పెద్దపేట జంక్షన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మామిడివలస సచివాలయం వీఆర్వో దూసి సంజీవరావుకు తీవ్ర గాయాలయ్యాయి. విధులకు హాజరయ్యేందుకు పాలకొండ రోడ్డులో బైక్‌పై వెళ్తుంగా.. ఎదురుగా వస్తున్న ఆటో బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వీఆర్వోను చికిత్స నిమిత్తం పాలకొండ ఆసుపత్రికి, అక్కడ నుంచి శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్దిలివానిపేట సమీపంలో ఒకరికి..

నందిగాం: మద్దిలివానిపేట సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దతామరాపల్లికి చెందిన టొంప రమణయ్య, మద్దిలోడిపేట సమీపంలోని పంట పొలానికి నీరు పెట్టేందుకు సైకిల్‌పై వెళ్తుండగా టెక్కలి నుంచి పలాస వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో రమణయ్యకు గాయాలవ్వగా 108 వాహనంలో చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రమణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత


పట్టుబడిన బియ్యం మూటలతో అధికారులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నుంచి ఒడిశా వైపు అక్రమంగా తరలిస్తున్న పీడీఎఫ్ బియ్యం మూటలను సీఎస్‌డీటీ సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నట్టు తహసీల్దార్ వెంకటరావు తెలిపారు. రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు గురువారం వేకువ జామున స్థానిక రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో రైల్వే ప్లాట్ ఫారంపై ఒడిశా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 14క్వింటాల పీడీఎఫ్ పట్టుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న ఉప్పలవీధికి చెందిన గేదెల ధనలక్ష్మితోపాటు మరో ఆరుగురుపై 6ఏ కేసు నమోదు చేసినట్టు సీఎస్‌డీటీ సంతోష్‌కుమార్ తెలిపారు. పట్టుకున్న బియ్యం మూటలను ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామని తెలిపారు. ఈ దాడుల్లో పౌరసరఫరాల అధికారి సంతోష్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపాడు వద్ద 592 కిలోలు..

శ్రీకాకుళం క్రైం: ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పెద్దపాడులోని ప్రధాన వీధికి చెందిన ఆటోడ్రైవర్ గుడ్ల లీలాకుమార్ తన ఆటోపై చిలకపాలెం నుంచి 14 బస్తాల్లో 592 కిలోల పీడీఎస్ బియ్యాన్ని తీసుకువస్తుండగా.. సమాచారం అందుకున్న విజిలెన్స్, పోలీసు అధికారులు పెద్దపాడు సమీపంలో పట్టుకున్నారు. ఈ బియ్యాన్ని నరసన్నపేటలో ఫ్లోర్ మిల్లు, హోటల్స్‌కు రూ.22 చొప్పున అమ్మేందుకు తీసుకెళ్తున్నట్టు లీలాకుమార్ చెప్పాడు. కాగా ఆటోను సీజ్ చేసి బియ్యాన్ని సీఎస్‌డీటీకి అప్పగించారు. వీటి విలువ సుమారు. రూ.26,936 ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

సరిచేసిన విద్యుత్ స్తంభాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


సరిచేస్తున్న విద్యుత్ స్తంభం

శ్రీకాకుళం రూరల్: పలుచోట్ల ఒరిగిన విద్యుత్ స్తంభాలను ఆ శాఖ సిబ్బంది గురువారం సరిచేశారు. చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయంటూ 'ఆంధ్రజ్యోతి'లో 'దశాబ్దాల నాటివే' శీర్షికతో గురువారం ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. దీంతో సింగుపురం-2 సచివాలయం పరిధిలో పంట పొలాల్లోకి ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. అలాగే గ్రామీన ప్రాంతాల్లో పాతపడి, విరిగిపోయేందుకు సిద్ధంగా ఉన్న స్తంభాలను కూడా మార్చాలని ఎస్ఈ ఆదేశించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్

ఆమదాలవలస: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. గురువారం పట్టణంలోని మీసేవా కేంద్రం వద్ద డ్వాక్రా సంఘ సభ్యులకు యూనియన్ బ్యాంక్ వారి సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. పలానా బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామ్మటూ ఎవరైనా ఫోన్ చేసి అకౌంట్ వివరాలు అడిగినా చెప్పవద్దని, ఏ బ్యాంకులు ఇలా ఫోన్ చేసి వివరాలు అడగరన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఎంసీ కె.రాజేష్, సీవో కె.వినోద్, ఆర్పీ భాగ్యలక్ష్మి, సీఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం


సాయాన్ని అందిస్తున్న వలస కూలీలు

ఇచ్ఛాపురం: ఈదుపురం గ్రామానికి చెందిన దల్లి గురుమూర్తి కొన్నాళ్లగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. పోలెండ్ దేశంలో వలస కూలిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. వ్యాధి తీవ్రం కావడంతో స్వగ్రామానికి తిరిగి వచ్చారు. వైద్య ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన తోటి కార్మిక సంఘ ప్రతినిధులు రూ1.51లక్షలు ఆర్థిక సాయాన్ని అందించారు.

అంధకారంలో ఆమదాలవలస

- వీధిలైట్లు లేక ఇబ్బంది
- పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం
- ఆందోళనలో పట్టణవాసులు
- ఎమ్మెల్యే ఆదేశించినా ఫలితం లేదు..


పూర్తిస్థాయిలో వెలగని ఎల్ఈడీ లైట్

ఆమదాలవలస: జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఆమదాలవలస మున్సిపాల్టీలోని చాలా వీధులు అంధకారంలో మగ్గుతున్నాయి. వీధిలైట్లు కూడా పాలకులు వేయించకపోవడంతో కొన్నాళ్లుగా రాత్రివేళల్లో బయటకు రావడానికి ప్రజలు భయపడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డుల్లోనూ కూడా పూర్తిస్థాయి వీధి దీపాలు లేకపోగా, కొన్నిచోట్ల సక్రమంగా వెలగకుండా మిసుకుమిసుకు మంటూ కనిపిస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా వీధివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని లక్ష్మీనగర్ వీధికి చెందిన ఓ వ్యక్తి ఆ వీధుల్లో అవసరమైన చోట వీధి దీపాలు లేకపోవడంతో.. లక్ష్మీనగర్ దరిద్రనగరంగా మారిందంటూ మున్సిపల్ అధికారుల తీరుపై మండిపడుతూ చేసిన ఓ ఆడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుందంటే పట్టణంలోని పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఆ ఆడియోను సమర్థిస్తూ పట్టణంలోని మరికొన్ని వార్డులకు చెందిన ప్రజలకు కూడా తమ ప్రాంతాల్లో కూడా వీధి దీపాలు లేకపోవడంతో పడుతున్న ఇబ్బందులను వివరించడం విశేషం. కాగా ఇటీవల జరిగిన మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే రవికుమార్ అన్ని వార్డుల్లో వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినా నేటికీ అది కార్యరూపం దాల్చలేదంటే.. అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. ఇటీవల కురిసిన వర్షాలకు చాలా వీధులు జలమయం కావడంతో విషసర్పాలు రోడ్లపై తిరుగుతున్నాయని పట్టణవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అన్ని వీధుల్లో లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు. దీనిపై వివరణ కోరేందుకు 'ఆంధ్రజ్యోతి' సంబంధిత అధికారులను ఫోన్‌లో ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు.

వేధింపులకు పాల్పడిన ఏఎన్ఎంపై చర్యలు తీసుకోవాలి


జేసీకి వినతిపత్రం అందిస్తున్న సంఘ ప్రతినిధులు

అరసవల్లి: ఆశ కార్యకర్తపై వేధింపులకు పాల్పడి ఆమె ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఏఎన్ఎంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు కె.నాగమణి, అధ్యక్షుడు డి.ధనలక్ష్మి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు డీఎంహెచ్‌వోకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టెక్కలి మండలం కె.కొత్తూరు పీహెచ్‌సీ పరిధిలో ఆశ కార్యకర్తగా పనిచేస్తున్న సనపల సరస్వతిని టెక్కలి సచివాలయం-3 పీహెచ్‌సీ ఏఎన్ఎం బి.హేమలత తీవ్ర వేధింపులకు పాల్పడిందని, దీంతో ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, ప్రస్తుతం టెక్కలి ఏరియా ఆసుపత్రిలో చావు బతుకుల మధ్య పోరాటం చేస్తోందన్నారు. దీనికి కారణమైన ఏఎన్ఎం హేమలత, ఎంఎల్‌హెచ్‌పీ కమలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

పాలిథిన్ కవర్లు వాడితే కేసులు

ఇచ్ఛాపురం: సింగిల్ యూజ్ పాలిథిన్ కవర్లు వాడితే కేసులు నమోదు చేస్తామని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం శ్యానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, సిబ్బంది మార్కెట్, మెయిన్‌రోడ్, పాన్ షాపులు, తోపుడు బండ్లు, చాట్, ఫాస్ట్‌ఫుడ్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. సింగల్ యూజ్ కవర్లు వాడుతున్న మూడు షాపుల యజమానులకు ఒకొక్కరికి రూ.వెయ్యి చొప్పున మూడు వేలు జరిమానా విధించడంతో పాటు 8.5 కిలోల ప్లాస్టిక్‌ను సీజ్ చేసినట్టు ఉపేంద్ర తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


మానవహారంగా నిల్చున్న కేజీబీవీ విద్యార్థులు

ఇచ్ఛాపురం: మాదక ద్రవ్యాలు (మత్తు పదార్థాలు) ప్రమాదకరమని, ఇటువంటి వాటికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఐసీడీఎస్ పీవో నాగరాణి అన్నారు. గురువారం బెల్లుపడ గ్రామంలో గల కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. నక్ష ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా విద్యార్థులచే మానవ హారం చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుజాత, నీలవేణి, పాఠశాల ఎస్‌వో, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా జట్లు ఎంపిక

ఇచ్ఛాపురం: సురంగి రాజా మైదానంలో ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) మండల స్థాయి క్రీడా జట్లు ఎంపికలు గురువారం ప్రారంభమయ్యాయి. జోన్-1 వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు కె.పద్మనాభంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికల్లో వివిధ పాఠశాలల నుంచి 220 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీ అండర్-14 (బాలురు, బాలికలు), ఖోఖో అండర్-17 బాలికలు, చెస్, యోగ, బ్యాడ్మింటన్, వాలీబాల్ అండర్-14 బాలికలు, బాలురు జట్లను ఎంపిక చేశారు. వీరంతా నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

లేగదూడల ప్రదర్శన

ఆమదాలవలస: చిట్టివలస గ్రామంలో గర్భస్త్ర కోశ చికిత్స, లేగదూడల ప్రదర్శన పశు వైద్యాధికారుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి ఎన్.దామోదర్ మాట్లాడుతూ.. శ్రీకాకుళం డివిజన్ పరిధిలో 90 శాతం కచ్చితత్వంతో ఆడ దూడల పుట్టేలా కృత్రిమ గర్భధారణ చేస్తున్నట్టు తెలిపారు. రూ.1350 విలువ గల రెండు వీర్య నాళికలు సబ్సిడీపై రూ.500కే అందిస్తున్నట్టు తెలిపారు. ఈ సందరంగా 42 పశువులకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు నిర్వహించారు. లేగదూడల ప్రదర్శనలో భాగంగా 28 దూడలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన పాడి రైతులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.ఆనందరావు, అక్కులపేట పశువైద్యాధికారి వై.హేమలత, పశువైద్యులు ఓంకార్, శరత్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్లాంటేషన్ పనులు తక్షణమే పూర్తి చేయండి

శ్రీకాకుళం కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని తక్షణమే పూర్తి చేయాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు సిబ్బందిని ఆదేశించారు. గురువారం జిల్లాలోని అన్ని మండలాల ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బందితో సమీక్షించారు. పీడీ మాట్లాడుతూ.. వ్యక్తిగత పండ్లతోటలు, ఇతర మొక్కల పెంపకాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పల్లె వనాల్లో భాగంగా ప్రతీ మండలంలో ఔషధ మొక్కలు కనీసం 20సెంట్ల విస్తీర్ణంలో చేపట్టాలన్నారు. ఈ నెల 17న జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న వన మహోత్సవంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీలు శైలజ, మురళీ కృష్ణ, రెడ్డి, నిర్వహణాధికారి కేవీ అప్పలనాయుడు, ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, అన్ని మండలాల ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ ఆక్రమణ నుంచి కాపాడాలి

సోంపేట: భూ ఆక్రమణదారుల నుంచి కాపాడాలని కొర్లాం గ్రామానికి చెందిన కృష్ణచంద్ర పాడీ తహసీల్దార్ అప్పలస్వామిని కోరారు. ఈ మేరకు గురువారం వినతి పత్రం అందించి సమస్యను వివరించారు. గ్రామరెవెన్యూ పరిధిలో గల సర్వే నెంబరు 91-1ఏ, 91-1బీలో 3.80 ఎకరాల భూమి వంశపారంపర్యంగా అనుభవిస్తున్నట్టు తెలిపారు. ఇటీవల బావనపాడు గ్రామానికి చెందిన ఎల్లారావు అనేవ్యక్తి ఆక్రమణ చేసేందుకు ప్రత్నిస్తున్నారని, దీనిని అడ్డుకోవాలని కోరారు.

ఎక్కువ కేసులు రాజీ చేయించండి


మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

గుజరాతీపేట: ఈ నెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో గురువారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌అదాలత్ కక్షిదారులకు సువర్ణ అవకాశమన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేసుకుని కొత్త జీవితం అవలంభించడానికి మంచి అవకాశమన్నారు. రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్, ఎక్సైజ్, బ్యాంకు సంబంధించిన కేసులను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ వేడుకలు విజయవంతం చేయండి

ఇచ్ఛాపురం: ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుకలు విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీ అనంతాచార్యులు అన్నారు. గురువారం మున్సిపాల్టీ పరిధిలో గల వివిధ పాఠశాలల్లో పర్యటించారు. ఏపీటీఎఫ్ ఏర్పడి ఎనిమిది దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా విజయనగరంలో నిర్వహించనున్న 20వ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఈవో అప్పారావును కలిసి డొంకూరు, బూర్జుపాడు ఉన్నత పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలని కోరారు. యూనియన్ నాయకులు పిశంకర్, జి ఉమాశంకర్, గోపాలకృష్ణమాచార్యులు, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి సన్మానం


ఎమ్మెల్యే అశోక్‌ను సన్మానిస్తున్న యూత్

కవిటి: ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు మడియారపుట్టుగ గ్రామంలో ఎండీఆర్ యూత్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల అభిమానాన్ని మరవలేనని అన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

వినాయకుడి లడ్డూ రూ.1.40 లక్షలు


లడ్డూను దక్కించుకున్న పాటదారులు

కవిటి: డి.గొనపపుట్టుగ గ్రామంలో వినాయక ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి లడ్డూ వేలం పాట ప్రతిభ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలం పాటలో పెద్ద లడ్డూ రూ1,40,100 గొనప బాలరాజు కైవసం చేసుకున్నారు. చిన్న లడ్డూను గొనప చాణిక్య రూ.35100కు దక్కించుకున్నాడు. గ్రామ పెద్దలు , మహిళలు పాల్గొన్నారు. అలాగే కొత్తూరు గ్రామంలోని రజక వీధి వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద యువసేన యువజన సంఘం సభ్యులు ఆధ్వర్యంలో కుంకుమ పూజలు చేపట్టారు.

కేశుపురంలో.. రూ.68 వేలు

ఇచ్ఛాపురం: కేశుపురం ఎస్సీ వీధిలో వినాయకుడి లడ్డూ వేలం గురువారం నిర్వహించారు. వేలం పాడేందుకు యువత, పెద్దలు పోటీ పడ్డారు. చివరికి ఆదేవీధికి చెందిన బాగా మోహన్‌రావు కుటుంబ సభ్యులు లడ్డూను రూ.68 వేలుకు దక్కించుకున్నారు.

అఖండ దీపారాధన



కంచిలి: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం వినియక మండపం వద్ద అఖండ దీపారాధన చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్, కూటమి నాయకులు జగదీష్ పట్నాయక్, కురయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పోరాటానికి అండగా ఏచూరి

- 2011లో పైడిభీమవరం వచ్చిన సీతారాం.. మృతికి సంతాపం


పైడిభీమవరం వచ్చిన సందర్భంగా కార్మికులతో సీతారాం ఏచూరి(ఫైల్)

అరసవల్లి/ పొందూరు: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతితో జిల్లా కార్మిక వర్గాల్లో విషాదం నెలకొంది. ఆయన జిల్లాకు వచ్చిన సందర్భాన్ని కార్మికులు గుర్తు చేసుకుంటున్నారు. 2011 నవంబరు 4న పైడి భీమవరంలోని రెడ్డీస్ ల్యాబొరేటరీస్ కార్మికులు తమ సమస్యలపై సమ్మెకు దిగారు. 100 రోజుల సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశ్రామికవాడ బంద్‌కు పిలుపునిచ్చారు. 15వేల మందితో రెడ్డీస్ పరిశ్రమను ముట్టడించేందుకు వెళ్లగా పోలీసులు బాష్పవాయువు ప్రయోగించి, కార్మికులపై లాఠీచార్జి చేశారు. ఈ ఘటనపై నిరసన తెలిపేందుకు సీతారాం ఏచూరి పైడిభీమవరం వచ్చి కార్మికులకు మద్దతుగా నిలిచారు. వారి సమస్యలను పరిష్కరించకుంటే పార్లమెంటులో ప్రస్తావిస్తామని ప్రకటించారు. దీంతో జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించింది. అటువంటి వ్యక్తి మృతితో కార్మిక వర్గాల్లో విషాదం నెలకొంది. కాగా ఏచూరి మరణం విచారకరమని కూటమి నాయకులు ఎమ్మెల్యే కూన రవికుమార్, అట్టాడ రవిబాబ్జీ, వామపక్ష నాయకులు అన్నారు.

దారేది?

- పిచ్చి మొక్కల మధ్య నుంచే..
- హౌసింగ్ కార్యాలయానికి వెళ్లేందుకు ప్రజలకు తప్పని ఇబ్బంది


పిచ్చి మొక్కలతో నిండిపోయిన హౌసింగ్ కార్యాలయం దారి

లావేరు: మండల కేంద్రం లావేరులోని గృహ నిర్మాణ కార్యాలయానికి వెళ్లేందుకు సరైన రహదారి లేదు. ఈ కార్యాలయానికి ఏదైనా పని మీద చేరు కోవాలంటే ఇలా దట్టమైన డొంకలను దాటుకుని భయం గుప్పిట్లో వెళ్లాల్సిందే. ఈ దారిలో దట్టమైన డొంకలు ఉండడంతో తరుచూ పాములు సంచరిస్తుంటాయి. అయినా సరే రోజు ఈ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది, కార్యాలయానికి వచ్చే వినియోగదారులకు మరే దారి లేకపోవడంతో ఈ దట్టమైన పిచ్చిమొక్కలు దాటుకుంటూ కార్యాలయానికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారలు స్పందించి ఈ డొంకలు తొలగించి స్థానికులు కోరుతున్నారు.

కేంద్రమంత్రికి పదవిపై హర్షం

ఎచ్చెర్ల: ఆసియా పసిఫిక్ సభ్య దేశాల చైర్మన్‌గా కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఎన్నిక కావడంపై టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి హర్షం వ్యక్తంచేశారు. గురువారం వారు మాట్లాడుతూ పిన్న వయసులోనే కేంద్రమంత్రి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్న రామ్మోహన్‌కు ఆసియా పసిఫిక్ దేశాల చైర్మన్‌గా నియమించడం ఆయన పనితనానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. జాతీయ రాజకీయాల్లో నాడు కింజరాపు ఎర్రన్నాయుడు చురుకుగా పాల్గొని జిల్లా పేరును ఇనుమడింపజేశారని, అదే బాటలోనే రామ్మోహన్ పయనిస్తూ జిల్లా ఖ్యాతిని చాటుతున్నారని చెప్పారు.

● **కంచిలి:** కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కు ఆసియా పసిఫిక్ మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ చైర్మగా పదవి దక్కడం కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కంచిలి మండలం టీడీపీ నాయకులు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

● **గార:** ఆసియా పసిఫిక్ సభ్య దేశాల చైర్మన్‌గా కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఎన్నికపై పలువురు మండల టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. చిన్న వయస్సులో మూడోసారి ఎంపీగా ఎన్నికై కేంద్ర మంత్రి పదవి అలంకరించి ఇప్పుడు చైర్మన్‌గా ఎన్నిక కావడం హర్షనీయమని మాజీ ఏఎంసీ చైర్మన్ పీస వెంకటరమణమూర్తి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బడగల వెంకట అప్పారావు, మాజీ ఎంపీపీ గుండ భాస్కరరావు, మాజీ జడ్పీటీసీ గొండు వెంకటరమణ, కూటమి నాయకులు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు నిమిత్తం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు ఏఈ గోవిందరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు బిర్లంగి, తోటూరు, సైదాలపుట్టుగ, బొడ్డబడ, గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని తెలిపారు.

● **రణస్థలం:** పైడిభీమవరం 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఈఈ బయ్యన్నాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో నారువ, బోయిపాలెం, అక్కయ్యపాలెం, మెంటాడ, దోనిపేట, సరగడపేట గ్రామల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

● **పొందూరు:** కింతలి, లోలుగు విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ దుర్గాప్రసాద్ తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు కనిమెట్ట, తోలాపి, బురిడి కంచరాం, నందివాడ, కేడీ పురం గ్రామాలకు విద్యుత్ నిలిపివేస్తామన్నారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సోంపేట: నగదు పురస్కారాలకు 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ప్రతిభ చూపిన శ్రీశయన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ సంఘ ప్రతిని ధులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతిలో 500 పైడి మార్కులు సాధించిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ట్టు తెలిపారు. ఈ నెల 20వ తేదీలోగా పట్టణంలోని మె యిన్ రోడ్డులో ఉన్న సాగర్ మెడికల్ షాప్ వద్ద దరఖాస్తులు అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 9010300860, 9493907575 ఫోన్ నెంబర్లులో సంప్రదించాలని కోరారు.

ఆమె నేత్రాలు సజీవం



అరసవల్లి: నగరంలోని న్యూ కాలనీ ప్రాంతంలో నివాసం ఉంటున్న కిల్లంశెట్టి తవిటమ్మ గురువారం మృతి చెందారు. ఆమె నేత్రాలను దానం చేసేందుకు కుమారులు సత్యనారాయణ, శ్రీనివాస్, సురేష్ ముందుకు వచ్చారు. దీంతో రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్‌రావుకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. మరణానంతరం కూడా ఈ ప్రపంచానికి వెలుగులు పంచిన ఆమెకు రెడ్‌క్రాస్ సెక్రటరీ బలివాడ మల్లేశ్వరరావు నివాళులర్పించారు. ఐ టెక్నీషియన్ పి.సుజాత, బ్లడ్‌బ్యాంకు పీఆర్వో ఎన్.ఉమాశంకర్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఎచ్చెర్ల: నవభారత్ జంక్షన్‌కు సమీపంలో శ్రీకాకుళం వైపు నుంచి చిలకపాలెం వైపు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్‌ను గురువారం ఎచ్చెర్ల పోలీసు సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తారకేశ్వరరావు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ఇచ్ఛాపురం: ప్రభుత్వం పేదలకు అందించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు శతశాతం జరిగేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ అధికారులను ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ప్రసాద్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జీవో 117ను రద్దుచేయాలి

పొందూరు: జీవో 117ను తక్షణమే ప్రభుత్వం రద్దు చేయాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ప్రతినిదులు డిమాడ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో ఫెడరేషన్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు గండెం రామారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సభ్యుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం వచ్చి మూడు నెలలు పూర్తయినా జీవో 117 రద్దు విషయంలో తాత్సారం చేస్తుండడం సరికాదన్నారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

● **సరుబుజ్జిలి:** ఇన్ సర్వీస్ కోటాను తగ్గించి ప్రభుత్వం ఆనాలోచితంగా ఇచ్చిన జీవో 85 వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వ వైద్యులు సంతోష్‌కుమార్, సాహితీ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో నల్ల బాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ జీవోను రద్దు చేయకపోతే 18 నుంచి దీక్షలు చేపడతామన్నారు.

వరద బాధితులకు సాయంగా..

సరుబుజ్జిలి: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు రొట్టవలస కేరళ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ బెవర హరినారాయణ ఆధ్వర్యంలో గురువారం సీఎం సహాయ నిధికి పాఠశాలలో హుండీ ఏర్పాటు చేసి విరాళాలు సేకరించారు. హెచ్ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయలు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తమవంతు సాయంగా అందాంచారు.

● **పొందూరు:** విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు పొందూరుకు చెందిన యంగ్‌స్టార్స్ యూత్‌క్లబ్, ప్రజాస్వామ్య పరిరక్షణ సమితులు సంయుక్తంగా విరాళాల సేకరణ చేపట్టారు. పొందూరు, జి.సిగడాం మండలాల్లో ప్రతీ గ్రామానికి తిరిగి నగదు, వస్త్రాలు, వంట సామగ్రి సేకరించారు. యంగ్‌స్టార్స్ అధ్యక్షుడు కె.శాంతారాం, కుమిలి రాజేష్, ఎల్.అప్పారావు, పేరూరి శ్రీనివాసరావు, ఎ.రవికుమార్, నాగరాజు పాల్గొన్నారు.